
# డెత్ విష్

అమరేంద్ర



"ఎవరో పాపం!"

"ముక్కలు ముక్కలైపోయాడు. మొండేనికి పది గజాల దూరానికి తెగి పడిపోయి దొర్లుతున్నది తలకాయ।"

"దొరబిడ్డలాగా ఉన్నాడు. దబ్బపండులాంటి శరీరం."

"చేతికి ఖరీదైన రిస్టువాచీ—వేలికి ఎర్రరాయి ఉంగరం."

"చాలా విలువైన షర్టూ, పాంటూ!"

"నిన్న రాత్రే జరిగి ఉంటుం దీ దారుణం."

"ఇది ప్రమాదమో? కావాలనే మెయిలు కింద పడ్డాడో?"

"ఇదుగో లెదర్ హాండ్‌బాగు. ఈత చెట్టుకొమ్మలో ఇరుక్కుపోయింది."

"పేరు నిత్యానందంట. బొంబాయిలో పెద్ద కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడుట. సొంత ఊరు ఇక్కడికి పట్టున పది మైళ్ళు కూడా లేదు."

"అన్ని హంగులూ, అన్ని వనర్లూ అమరిన మనిషిలాగా కనిపిస్తున్నాడు!"

"మరి ఇంత దురాగతం ఎందుకు జరిగిందో?"

"ఎవరు చెప్పగలరు? ఎవరి నుదుటిమీద ఎలా రా °సి ఉంటే అలా జరుగుతుంది. రాతను ఎవరమూ తప్పించలేం."

"ముందు మనం వాళ్ళ ఊరికి కబురు చెయ్యాలి. వాళ్ళ మనుమ లెవరైనా తరవాత జరగాల్సిన పనులు చూనుకుంటారు."

మర్నాడు పొద్దున ముక్కలైపోయిన శవం చుట్టూ గుమికూడిన మనుమలంతా భయమూ, ఆందోళనా, అశ్చర్యమూ వెల్లడించే వ్యాఖ్యానాలు చేస్తున్నారు. అది స్టేషనుకు రెండు కిలోమీటర్ల దూరంగా ఉన్న నిర్జన ప్రదేశం. ఆ ఊరిజనం కాలకృత్యాలు తీర్చుకోటానికి చెంబులు పుచ్చుకుని ఉదయం కాగానే పోతూ ఉంటారు. తాటిచెట్లూ, తుమ్మచెట్లూ, వేపచెట్లూ, ఈతచెట్లూ, రాళ్ళు రప్పలూ, ముళ్ళకంచెలూ చీకట్లో జడలు విరబోసుకుని రాక్ష °స నీడల్లాగా భయంకరంగా ఉంటాయి. సంజకెంజాయిల్లో ఆ ప్రదేశమంతా నెత్తురు చిమ్మినట్లుగా పెద్దవాళ్ళకే గుండె గుభేలు మనేట్లుగా ఉంటుంది. అందుకే పిల్లలు



కథా నిలయం
శ్రీకాకుళం

ఆడుకోవటానికి ఆ ప్రదేశానికి పోరు. లెవెల్ క్రాసింగు దాకానే వెళ్ళి గేటుమీద కూచుని ఆ చోట లోగడ చాలా ప్రమాదాలు జరిగాయని, చచ్చిపోయిన వాళ్ళు రాత్రివేళ అక్కడ దయ్యాలుగా తిరుగుతూ ఉంటారనీ కబుర్లూ కథలూ చెప్పుకుంటూ ఉంటారు. అటువంటి భయంకర ప్రదేశంలోనే నిత్యానందం కథ ముగిసిపోయింది. అది ప్రమాదమా? ఆత్మహత్యా? ఈ సందేహం ఆ శవం చుట్టూ గుమికూడిన వాళ్ళందరినీ వేధిస్తోంది. ఎవరికి తోచిన విధంగా వాళ్ళు అనుకుంటున్నారు. అసలు నిజం ఎవరికీ అంతుపట్టటంలేదు. అన్ని విధాలా హాయిగా జీవించవలసిన మనిషి మృత్యువుకు ఎందుకు బలి అయిపోయాడో నని జాలి పడుతున్నారు అందరూ. ఆశ్చర్యం మరి కొందరికీ, ఆవేదన మరి కొందరికీ. చావు బతుకుల మధ్య సరిహద్దు రేఖ చాలా సన్నగా కంటికి కనబడీ కనబడకుండా ఉంది. నిన్నటి దాకా దొరబిడ్డలాగా తిరిగినవాడు, ఇవాళ తునాతునకలై రైలు పట్టాలమీద పడి మట్టిలో నెత్తురు మడుగులో దొర్లుతున్నాడు. ఈ కబురు ఆ నోటా, ఆ నోటా పడే చుట్టుపక్కల ఊళ్ళ మనుషులు గుంపులు గుంపులుగా వచ్చి ఆ భయానక దృశ్యం చూసి బెదిరిపోతున్నారు.

మిట్టమధ్యాహ్నం వేళకి చనిపోయిన మనిషి తాలూకు చుట్టాలు వచ్చారు. ఖండాలైన మొండేన్నీ, తెగి దూరంగా పడిపోయిన తలకాయనూ ఈతాకు చాపలో చుట్టుకుని ఒక ట్రాక్టరులో సొంత ఊరు చేర్చారు. సెలవుల్లో భార్యనూ, పిల్లలనూ సొంత ఇంట్లో ముసలి తల్లితండ్రులకు సాయంగా ఉండమని దిగవిడిచి నిత్యానందం బొంబాయి వెళ్తున్నానని చెప్పి పొద్దుగుంకే వేళ బయలుదేరాడు. బస్సు ఎక్కి విజయవాడ వెళ్తున్నానని చెప్పాడు. "చీకటి పడుబోతోంది. రేపు వెళ్దురుగాని...తొందరేముంది" అని భార్య సునీత ఎంత ప్రాధేయపడినా వినిపించుకోకుండా మొండిపట్టుగా బయలుదేరాడు. ఆఫీసువాళ్ళు సెలవు రద్దు చేసుకుని వెంటనే వచ్చేసి డ్యూటీలో చేరమని టెలిగ్రామ్ ఇచ్చారు. సునీత కూడా వస్తానని ఎంత బతిమాలినా నిత్యానందం వినిపించుకోలేదు.

** ** **

అప్పుడు నిత్యానందానికి నాలుగేళ్ళుంటాయి. చెరువు గట్టున సినయ్యగారి కొడుకు శంకరంతో ఆడుకుంటున్నాడు. ఇద్దరూ టెన్నిసు బంతిని తన్నుకుంటూ ఒకళ్ళ నొకళ్ళు తరుముకుంటూ నీళ్ళ అంచుదాకా వెళ్ళారు. వానాకాలం చెరువు నిండా నీళ్ళు గట్లని ఒరుసుకుని అలలతో తుళ్ళింతలాడుతోంది. ఒడ్డునున్న రావిచెట్ల నీడలు అలలమీద తూగుతున్నాయి. బంతి నీళ్ళలో పడింది. గాలి ఊపుకి కొలను అలలమీద ఇంకా ఇంకా ముందుకుపోతోంది. బంతి వెంబడే శంకరం నేలమీద పరిగెత్తినట్లు ముందుకు సాగాడు. కొన్ని క్షణాల్లో కనబడకుండా పోయాడు. బంతిమాత్రం నీళ్ళమీద తేలుతూ కొంత సేపు కనబడింది. "శంకరం, శంకరం వస్తున్నా" అని కేకలు పెడుతూ నిత్యానందం నీళ్ళలోకి పరిగెడుతున్నాడు. "ఆగు, ఆగు, నిత్యా! వస్తున్నా" అంటూ గట్టుమీద నుంచి అన్న సత్యానందం. గావుకేకలు పెడుతూ రేవులోకి దూకి నిత్యానందం రెక్కలు పట్టుకుని గట్టుమీదికి బలవంతాన లాక్కువచ్చాడు.

"వొదులు—నన్ను వొదిలెయ్యి. నేను. శంకరంతో ఆడుకోటానికి వెళ్ళాలి" అంటూ పెనగులాడాడు నిత్యానందం. తమ్ముణ్ని వదలకుండా వాటేసుకుని పట్టుకున్నాడు సత్యానందం.

సత్యానందం చిరాగ్గా కేకలు పెట్టాడు. ఊళ్ళో జనమంతా పోగైనారు. చాలా సేపు గాలించి శంకరాన్ని ఒడ్డుకి తీశారు. అప్పటికే బాగా నీళ్ళు తాగి ఉబ్బిపోయాడు. ఎన్ని ప్రయత్నాలు చేసినా లాభంలేకపోయింది. "శంకరం, శంకరం, నేనూ వస్తాను" అని పెనగులాడుతున్న నిత్యానందాన్ని అన్నా, తండ్రీ కలిసి అక్కణ్ణుంచి ఇంటికి ఈడ్చుకుని వెళ్ళారు.

"నన్ను శంకరం దగ్గరికి పోనిస్తారా, లేదా?" అని పగలూ రాత్రీ పలవరించాడు నిత్యానందం.

ఇక శంకరం తనకు కనిపించడనే కఠోర సత్యం అతని మనస్సుమీద అచ్చుపడిపోయింది. ఆడుకుంటున్న తమ ఇద్దరినీ క్షణంలో ఎవరో

ఎడం చేశారు. ఎవరది? ఎవరో చూడాలి. ఎవరో కనుక్కోవాలి...

కొన్నాళ్ళ తరవాత. ఒక సాయంకాలం. పాడెమీద నిత్యానందం మేనత్త సుందరమ్మ శవం. ఆవిడకి నిత్యానంద మంటే పంచప్రాణాలు. వైధవ్యం వచ్చి అన్నగారి పంచన చేరింది. అన్నగారింట్లో పనిపాట్లన్నీ చేస్తూ అన్తమానం నిత్యానందాన్ని ఒళ్ళో కూచోబెట్టుకుని ఆడిస్తూ ఉండేది. అల్లారుముద్దుగా గోరుముద్దలు తినిపిస్తూ, కథలూ, పాటలూ చెబుతూ ఉండేది. హఠాత్తుగా కలరా తగిలింది. తెల్లవారేసరికీ ప్రాణం విడిచింది. పాడె పైకెత్తి నలుగురు సాయం పట్టారు. అప్పటిదాకా ఎక్కడున్నాడో-పరిగెత్తుకుంటూ వచ్చాడు నిత్యానందం. "అత్తా! నేనూ వస్తాను—నన్ను వదలండి" అంటూ పెనగులాడుతున్న కుర్రాణ్ణి బలవంతంగా ఎడంగా తీసుకువెళ్ళారు. అమ్మకంటే ఎక్కువ ఆప్యాయంగా ముద్దుచేసిన అత్తను తనకు దూరంగా తీసుకుపోతున్న దెవరో? అత్తను మళ్ళీ కంటికి కనబడకుండా దూరంగా తీసుకుపోయిం దెవరో? ఎవరో?...

చీకటి పడ్డాక నిత్యానందం అత్తకోసం వెదుక్కున్నాడు. రోజూ అత్త పక్కలో పడుకొని ఆవిడ చెప్పే కథలు వింటూ అక్కడే నిద్రపోయేవాడు. ఆ రాత్రి పిల్లాడిని తన పక్కలో పడుకోబెట్టుకుంది. ఉక్కపోతగా ఉండటంవల్ల మంచం ఆరుబయట వేసింది. పక్కన చేరిన నిత్యానందం దగ్గరగా జరిగి—

"అత్త ఇంకా రాలేదేం అమ్మా?" అన్నాడు.

"అత్త ఇంక రాదు."

"ఎప్పుడూ రాదా?"

"రాదు."

"ఎక్కడికి వెళ్ళింది?"

"అదుగో! అక్కడికి." అంటూ చిమ్మచీకట్లో మిణుకు మిణుకుమంటున్న చుక్కల ముగ్గులు చూపింది. "దున్నపోతు ఎక్కి వచ్చి యమధర్మరాజు అత్తను తీసుకువెళ్ళాడు" అనగానే "నాకు భయంగా ఉందమ్మా!" అని నిత్యానందం వెక్కి వెక్కి ఏడ్చాడు. తల్లి కుర్రాణ్ణి గుండెకు హత్తుకుని" ఛీ! భయం దేనికి? నేను శ్లోకం చెబుతాను. "రామస్కంధం" అను. "రా...మ...స్కం...ధం...హనోమంతం" అంటూ నిద్రపోయాడు.

నిద్రమగతలోకి జారిపోతూ "అమ్మా యమధర్మరాజు మనకి కనిపించడా?" అన్నాడు.

"ఇప్పుడు కనిపించడు. నువ్వు కళ్ళు గట్టిగా మూసుకో...రామస్కంధం హనోమంతం" అనుకుంటూ ఉంటే నిద్ర అదే వచ్చేస్తుంది" అంది తల్లి.

"ఒరేయ్ కృష్ణా! ఒరేయ్ ఆగండి. మీకేం పోయేకాలం వచ్చింది. సమయానికి నేను రాకపోతే ఇద్దరూ చచ్చిపోయేవాళ్ళు కదా" అంటూ పూజారి కాంతమ్మ వాళ్ళిద్దరూ నోట్లో పెట్టుకుని నములుతున్న గన్నేరు పప్పులు కక్కించివేసింది. ఇద్దరినీ రెక్కలు పుచ్చుకుని ఈడ్చుకుపోయి ఇళ్ళ దగ్గర పెద్దవాళ్ళకు అప్పగించింది. ఇంకెప్పుడూ రామాలయంలోకి రానివ్వద్దని చెప్పింది. కాంతమ్మకు పిల్లలు లేరు. ఊళ్ళో పిల్లలందరినీ తన పిల్లలుగా చూసుకుంటుంది. వాళ్ళకి పప్పు బెల్లాలూ, జామపిందెలూ, బిళ్ళలూ పెడుతుంది. అందుకే ఊళ్ళో పిల్లలందరూ సాయంకాలం బడి విడిచిపెట్టగానే గుళ్ళో ఆడుకోటానికి వెళ్తారు. గుడిచుట్టూ బాదంచెట్లూ, మందారాలు, పున్నాగాలూ, గన్నేరు మొక్కలూ, మల్లెపందిళ్ళూ కనుల పండుగగా ఉంటాయి. మిగతా పిల్లందరూ బాదంకాయలు కొట్టుకుని పప్పులు తింటున్నారు. ఎలా బుద్ధి పుట్టిందో కాని కృష్ణుడూ, నిత్యానందమూ పిసవు గన్నేరు పప్పులు తినబోతున్నారు. సరిగ్గా సమయానికి కాంతమ్మ అక్కడికి రాబట్టి వాళ్ళిద్దరి ప్రాణాలూ దక్కినయ్.

"నీకేం పోయేకాలం వచ్చింది. బంగారంలా బడికి వెళ్ళి చదువుకోక. ఎవరు చెప్పారు నీకు?" అంటూ తల్లి నిత్యానందం వీపుమీద దెబ్బలు వేసింది.

"కృష్ణుడు చెప్పాడమ్మా..."

"ఏం చెప్పాడు?"

"గన్నేరు పప్పులు తింటే యమధర్మరాజు కనిపిస్తాడని..."

"ఏడవకపోయావు? వాడు చెప్పటం నువ్వు వినటం. ఇవాళిటి నుంచీ ఇల్లు కదిలావా కాళ్ళు విరగ్గొడతాను" అంటూ తలమీదా, వీపుమీదా చేతికొద్దీ బాదింది.

అప్పట్నుంచీ నిత్యానందం ఊళ్ళో పిల్లలెవరితోనూ కలిసి ఆడుకోలేదు. వాకిట్లో అరుగుమీద ఒంటరిగా కూచుని ఆకాశంవైపు ఏదో వెదుకుంటున్నట్లు చూస్తూ కూచునేవాడు. ఒక్కొక్క రోజు బడి విడవగానే పుస్తకాల సంచీ ఇంట్లో పడేసి నీళ్ళరేవు గట్టుమీద గంటల తరబడి ఏదో ఆలోచిస్తున్నట్లు చతికిలపడి



ఉండేవాడు. రావిచెట్లు, మర్రిచెట్లూ చెరువు గట్టునుంచి సంజెకెంజాయలో ఎరుపెక్కిన నీటి తెపకలమీద నల్లటి నీడలు పరుస్తూ ఊగుతుంటే ఏదో ఊహల్లో విహరిస్తూ ఉండేవాడు.

చూడాలి. ముఖాముఖి చూడాలి. నల్లటి మబ్బులాటి దున్నపోతు నెక్కి, ఇనప గంటలు గణగణ మంటుంటే, పొడుగైన పాశాలు విసురుకుంటూ వచ్చే యమధర్మరాజుని కళ్ళారా చూడాలనే వింతకోరిక విడ్డూరమైన కోరిక నిత్యానందం గుండెలో నాటుకుపోయింది. అడవి తీగలాగా మనస్సులో అల్లుకుపోయింది. కారు చిచ్చులాగా లోపల అంతా గంతులేస్తోంది.

అన్న సత్యానందంతో పాటు పైచదువుకోసం నిత్యానందాన్ని కూడా పక్కనున్న బస్తీకి పంపించారు. చదువులో చురుకుగానే పైకి వస్తున్నాడు. కాని, ఎప్పుడూ ఒంటరిగా మెసులుతూ ఎవరితోనూ కలిసేవాడు కాడు. తన లోకంలో తనే ఒంటరిగా సంచరిస్తున్నట్లుండేవాడు. ఏదో పోగొట్టుకున్నట్లు, దేనికోసమో ఎప్పుడూ వెతుకుతున్నట్లు ఉండేవాడు. లోకం బరువంతా తను ఒక్కడూ నెత్తిమీద మోస్తున్నట్లుండేవాడు. "నిత్య విషాదం" అని క్లాసులో పిల్లలు ఎగతాళి చేసేవాళ్ళు. పేరుకి తగినట్లు అన్నయ్య సత్యానందం ఎప్పుడూ ఆడుతూ పాడుతూ సరదాగా ఉండేవాడు.

నిత్యానందం మంచి మార్కులతో బి.ఎ. పాసయ్యాడు. ఎక్కువ ప్రయత్నం లేకుండానే ఉద్యోగం కూడా వచ్చింది బొంబాయిలో ఒక కంపెనీలో. పెళ్ళి చేస్తే మామూలు మనిషి అవుతాడనీ, నలుగురితో పాటుగా నడుచుకుంటాడనీ తల్లితండ్రులు ఆశపడ్డారు. సునీత నిచ్చి వివాహం చేశారు. దగ్గర బంధువు. చిదిమి దీపం పెట్టుకునే అందం. అందరి మెప్పులూ పొందిన సుగుణరాశి. కాపురం అనుకూలంగా సాగిపోతోంది. ఇద్దరు పిల్లలు—ఒక అమ్మాయీ, అబ్బాయి.

"ఎందుకండీ! మీకేం తక్కువ? ఎప్పుడూ ఎందుకలా దిగులుగా ఉంటారు? ఈ లోకంలో ఉన్న వేదనా, దుఃఖమూ మీరే మోస్తున్నట్లుగా దిగాలుపడి ఉంటారెందుకు?" అని సునీత ఎన్నోసార్లు గుచ్చి గుచ్చి అడిగేది.

నిత్యానందం పెదవి విప్పేవాడు కాడు. మృత్యువుతో ముఖాముఖీ భేటీ వేసుకోవాలనే తపన మనస్సును వేధించేది. తీరని దాహంతో పరితపించే ప్రాణి ఎండమావులను తరుముకుంటూ వేసారిపోతున్నట్లుండేది. తను దగ్గరగా పోవాలని వెంపరలాడిన కొద్దీ మృత్యువు తనను గేలి చేస్తూ దూరదూరంగా పరిగెత్తుతోంది. పంచవటిలో లక్ష్మణుని మురిపిస్తూ గంతులు వేసిన బంగారు లేడి జ్ఞాపకం వచ్చేది. బొంబాయిలో పక్క వాటాలో ఉండే విద్యార్థి చదువుతూ ఉండే పంక్తి "యముని మహిషపు లోహఘంటలు మబ్బుచాటున ఖణేల్ మన్నాయి" అనే అక్షరాలు కళ్ళముందు అస్తమానం కదిలేవి. చూడాలి కళ్ళారా, వినాలి చెవులారా అనే కోరిక లోపల ఆరని జ్వాలగా రగులుతోంది.

మృత్యువు అందినట్లే అంది ఇట్టే మటుమాయమై పోయింది కొన్నిసార్లు. ఆఫీసు పనిమీద అర్జంటుగా విమానంలో శ్రీలంక వెళ్ళమని నిత్యానందాన్ని నిర్దేశించారు. ప్రమాదవశాన విమానం బొంబాయి శాంతాక్రుజ్‌లో హఠాత్తుగా నిప్పంటుకుని గాలిలో వలయాలు తిరిగింది. ప్రయాణీకులంతా క్షణాల్లో మృత్యువుకు ఆహుతైపోతారని అంతా భీతాహంతో అదిరిపోయారు. ఇంతలో పైలట్ అత్యంత చాకచక్యంతో విమానాన్ని కిందికి దింపాడు. క్షణాల్లో మంటలు ఆర్పేశారు. ప్రయాణీకులందరూ భద్రంగా బయటపడ్డారు. నిత్యానందానికి ఎంతో ఆశాభంగం కలిగింది.

ఇంకోసారి రాజమండ్రి ఆఫీసు పనిమీద వెళ్ళి వెన్నెల రాత్రి గోదావరి గట్టున చాలా సేపు ఒంటరిగా కూచున్నాడు. "యముని మహిషపు లోహఘంటలు" అనే మాటలతో మనస్సు గింగురుమంటోంది. వరద గోదావరి పరవళ్ళు తొక్కుతోంది. ఈలలు వేసే హోరుగాలిలో ఎవరో తనని రమ్మని పిలుస్తున్నట్లనిపించింది. రైలు బ్రిడ్జి పట్టాల వెంబడి నడవటం మొదలుపెట్టాడు. కొంత దూరం వెళ్ళాక తనకి తెలియకుండానే నీళ్ళలోకి దూకేశాడు. అదే సమయానికి ఒక గజయీతగాడు వరద గోదావరికి ఎదురీత సాధన చేస్తున్నాడు. నీళ్ళలో పడగానే నిత్యానందాన్ని ఒక చేత్తో ఒడిసి పట్టుకుని మెల్లిగా గట్టుకు చేరుకున్నాడు. నీళ్ళలో తడిసి ముద్దయిపోయి గజగజ వణకిపోతున్న నిత్యానందాన్ని ఒడ్డున దిగబెట్టాడు. "ఎందుకు చేశావీ పిచ్చిపని? అనవసరంగా ప్రాణం పోయేది. ఇంకెప్పుడూ చెయ్యనని మాట ఇస్తే వదిలేస్తా. లేకపోతే ఆత్మాహత్యా ప్రయత్నం చేశావని పోలీసులకు చెప్పి లాకప్‌లో పెట్టిస్తాను" అని గజయీతగాడు బెదిరించాడు. వంచిన తల ఎత్తకుండా నిత్యానందం గోదావరి గట్టు వెంబడే వెళ్ళిపోయాడు.

మరొకసారి నిత్యానందం ప్రయాణం చేస్తున్న రైలు కారుచీకట్లో ఘోర ప్రమాదానికి గురి అయిపోయింది. పట్టాలు తప్పి ఒక బోగీ తలకిందులైనది. అందులో ఉన్న ప్రయాణీకుల శరీరాలన్నీ ముక్కలైపోయాయి. ఆ కిందటి స్టేషనులోనే నిత్యానందం కండక్టరుని బతిమాలుకుని స్లీపరు కంపార్టుమెంటులోకి మారాడు. నిత్యానందం చేజిక్కిన పెన్నిధి ఆకస్మికంగా జారిపోయినంత బాధపడ్డాడు. పట్టాభిషేకం జరగవలసిన రాజకుమారుడికి హఠాత్తుగా రాజ్య బహిష్కారం జరిగినంత నిర్వేదంతో బాధపడ్డాడు.

అందుకే చివరిసారి ఇంట్లోనే సాహసం చేశాడు. భార్యాబిడ్డలూ, తనూ సెకండ్ షో సినిమా చూసి వచ్చారు. భోజనాలయినాయి. అంతా నిద్రలో మునిగిపోయారు. నిత్యానందం ఒక్కడే మేలుకున్నాడు. బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు. ఎక్కడా అలికిడిలేదు. లోపలి గడియ వేసుకున్నాడు. కిరసనాయలు ఒంటి నిండా పోసుకున్నాడు. అగ్గిపెట్టె వెలిగించి అంటించుకున్నాడు. క్షణంలో బట్టలన్నీ జ్వాలాతోరణంలాగా అంటుకుపోయాయి. తెరిచి ఉన్న కిటికీలోంచి కాలుతున్న వాసన కొట్టింది. సునీత ఉలిక్కిపడి లేచి చూసింది. పక్కన భర్త మంచం ఖాళీ. ఒక్క పరుగున బాత్‌రూమ్ దగ్గరికి పరిగెత్తింది. కెవ్వున కేకలు పెడుతూ తలుపులు దబదబా బాదింది. చుట్టుపక్కల ఫ్లాట్లలోని వాళ్ళంతా నిద్రలు లేచి పరుగు పరుగున వచ్చారు. బయటనుంచి బాత్‌రూమ్ తలుపులు పగలగొట్టారు. స్పృతప్పి పడిపోయిన నిత్యానందాన్ని బయటికి తీశారు.

తెల్లారిన తరవాత సర్వోదయ ఫ్లాట్సు వాళ్ళందరూ కూడబలుక్కుని నిత్యానందం చేత ఒక నెల రోజులు సెలవు పెట్టించారు. సొంత ఊరు నుంచి అన్న సత్యానందం వచ్చి తమ్ముణ్ణీ, కుటుంబాన్నీ తీసుకువెళ్ళాడు.

కాని, అంతా వద్దంటున్నా ఆ సాయంకాలం మొండిగా బయలుదేరాడు. అదే అతని ప్రయాణం ఆఖరి మజిలీ. అదే అతని చిరకాల వాంఛకు పరిసమాప్తి.

ఆదిలోనే అంతం ఉంది.

తుదిలోనే మొదలు ఉంది. ★



# వ్యాయామం-క్రీడలు

వై. ఎమ్. సి. ఎ వ్యాయామ కళాశాల అధ్యాపకుడుగా పనిచేసిన ఆనాటి ప్రిన్సిపాల్ స్వర్గీయ సి. సి. అబ్రహాం ప్రత్యేక ప్రశంసలను అందుకున్నవారు శ్రీ ఎమ్. ఆనందరావ్ సుందరం. మదనపల్లె థియోసాఫికల్ కళాశాల వ్యాయామ అధ్యాపకులుగా పనిచేసి యువ క్రీడాకారులలో క్రమశిక్షణ పెంపొందడానికి వీరు చేసిన కృషి మరవరానిది. ఒకవైపు కళాశాల యువకులకు శిక్షణ ఇస్తూ, మరొకవైపు గ్రామాలలో క్రీడోత్సవాలనూ నిర్వహించారు. 1952—53 మద్రాసు ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి. పూర్వాంధ్రలో హాకీ క్రీడాభివృద్ధికి విశేషంగా పాటుపడ్డారు. ప్రస్తుతం వీరి వయస్సు డెబ్బై అయిదు సంవత్సరాలు.

—ఏకా